# కారణం ఎవరు?

లాయర్ 4-6-92

ఈ దేశపౌరుడు— 'నా కెందుకులే'

అని....

అనుకున్నంత వరకు ఈ దేశం బాగుపడదు.

—జయప్రద

"ఇన్స్టాల్ రైట్ కమాన్ శోభా! ఎక్కు ఎక్కు" తొందర పెట్టాను మా చెల్లెల్ని నేను. ఆటో అతను మీటరు మీద రెండు రూపాయలు ఎక్కువ ఛార్జి అడుగుతున్నాడు. ఎక్కువ లగేజ్ కూడా లేదు కదా ఎందుకివ్వాలి? అనేది మా శోభ వాదం రీజనబుల్ వాదమే.

కాని ఇది కాలయాపన చేసే సమయం కాదు. రాత్రి బెంగుళూరులో వున్న మా స్నేహితురాలి కూతురి పెళ్ళి చూచుకుని తిరిగి

వస్తున్నాం. ఇప్పుడు మేము వేలూరు వెళ్ళి సి. యమ్. సి. హాస్పిటల్ వెళ్ళి రిపోర్ట్ తీసుకుని ఈ రోజే రాజమండ్రి వెళ్ళిపోవాల. తెచ్చుకున్న డబ్బు అయిపోబోతోంది. వారం రోజులుగా సి యమ్ సి అనబడే విసుగు లోకంతో కొన్ని వందల రూపాయలు ధారపోసి ఒంట్లో రక్తంలో సగం పరీక్షల నిమిత్తం ఇచ్చేసి ఇలా బెంగుళూరు వచ్చాం మరలా ఈ రోజు సోమవారం పదకొండు గంటలలోపల వెళ్ళితేనే ఓల్డ్ కార్డ్ రిజిస్టర్ చేస్తారు. ఆ తర్వాత ఆ రిపోర్టుచూసి కరుణించి ప్రిస్క్రిప్షన్ యిస్తే ధన్యులమై రాజమండ్రి చేరుకోవచ్చు పాపం పిల్లలు ఎలా వున్నారో!

ఆటో దబ దబ శబ్దాలు చేసుకుంటూ స్నేక్ డ్యాన్స్‌చేస్తూ మా గుండెరేట్‌ని పెంచుతూ రైల్వేస్టేషన్ ఎదురుగా వున్న ఆర్. టి. సి. బస్‌స్టాండువైపుగా వెళ్తోంది. ఆటో డ్రైవర్ వెనక్కి తిరిగాడు. మా అదృష్టం అతనికి తెలుగొచ్చు. మధ్యదారిలో ప్రైవేట్ బస్‌స్టాండ్ వుంది. అక్కడ చూస్తారా అన్నాడు.

టైమ్ చూచుకున్నాను.

ఎంత వేకువనలేచినా అప్పుడే ఆరయిపోయింది. బెంగుళూరు నుండి ఐదు గంటల ప్రయాణం వేలూరుకు.

ఆటో ఆపమన్నాను.

ఓ చిన్న కుర్రాడు ఆశగా పరుగెట్టాడు మా సామానులు మోసి ఓ రూపాయి సంపాదించుకోవచ్చునని డ్రైవర్ కన్నడంలో అడిగాడు వాణ్ని. "వేలూరు వెళ్ళే బస్సు రెడీగా వుందేమో చూసిరా" అని బస్ స్టాండు బయట కదలబోతున్న సూపర్ డీలక్స్ బస్ చూపించాడు వాడు.

నేను ఆటో నుండి దూకేసాను.

ఆటోకి చిల్లరిచ్చి వచ్చేయమని శోభకు చెప్పి సూట్‌కేస్ పట్టుకుని బస్ ఎక్కేసాను. బస్ కదుల్తోంది కాని శోభ ఎంతకీ రాదు కండక్టర్‌ని బస్ ఒక్క నిముషం ఆపమని ప్రాధేయపడి ఆటో దగ్గరకు పరుగెట్టాను.

చిల్లరలేదు రెండూ వందల రూపాయల నోట్లే అంది యింకా పర్సు వెతుకుతూనే "పది రూపాయలుంటే చూడు" అన్నాను ఆత్రుతగా.

బస్ వెళ్ళిపోతుందని గాభరా సూపర్ డీలక్స్ బస్ అంటే తమాషానా? ఎంత హాయిగా వుంటుంది అందులో ప్రయాణం. కొద్దిగా చార్జి ఎక్కువైతే మాత్రం ఏం? పైగా సూపర్ డీలక్స్‌లో అయితే నాలుగు గంటలే ప్రయాణము.

పది రూపాయల నోట్ దొరకలేదు పది రూపాయిలయితే డ్రైవర్ దగ్గర చిల్లరలేకపోయినా అదిచ్చేసి వచ్చేయాలన్నంత కృతజ్ఞతగా వుంది. అతనికై అతను ఇక్కడ ఆటో ఆపకపోతే మాకింత హాయయిన్ బస్ దొరికేదా?

వంద రూపాయలు నోట్ తీసుకుని కండక్టర్ దగ్గరకు పరుగెట్టాను. అతను విసుగ్గా మొహం పెట్టుకున్నాడు. డ్రైవర్ ఇంజన్ ఆపలేదు. యిద్దరూ నావైపు గుర్రుగా చూస్తున్నారు నా ఎర్రని వి.ఐ.పి. సూట్ కేస్ వాకిలికడ్డంగా వుంది.

అది అక్కడ లేకపోతే వెళ్ళిపోదురో ఏవిటో. ఒక్కక్షణం అలా సూట్ కేస్ ఆ బస్‌పరం చేసి దిగినందుకు నన్ను నేను అభినందించుకున్నాను.

ఆటోకి నాలుగు రూపాయలివ్వండి తర్వాత చిల్లరిస్తురు. ఇంగ్లీషులో అని వంద రూపాయల నోటు అతని చేతిలో వుంచాను. పాపం మంచోడో మంచి కాలమో నాలుగు రూపాయలు నా చేతిలో వుంచి కన్నడంలో తొందరగా వచ్చేయమన్నాడు. మానవుడికి బొత్తిగా ఇంగ్లీషుగానీ తెలుగుగానీ వచ్చినట్టు లేదు.

★ ★ ★ ★

అబ్బ! ఎంత మెత్తగా వున్నాయి సీట్లు! అని తెగ ఆనందపడిపోయింది శోభ.

నేను డీలక్స్ బస్‌లో చాలాసార్లు ప్రయాణం చేసాను కానీ ఈ రోజు మాత్రం నాకు చాలా హాయిగా వుంది. సీట్లు- మెత్తగా వున్నా

యని కాదు పది పదిన్నరకల్లా విసుగు లోకంలో పడి మరో రెండు మూడు గంటల్లో అందులో నుండి విముక్తి చెందుతామని. "హాయిగా పడుకోవచ్చు" అంది శోభ వెనక్కివాలి రిలాక్స్ అవుతూ. నేనువెనక్కి వాలి పడుకున్నాను

పాపం ఆ కుర్రాడి చేతిలో ఓ అర్ధరూపాయన్నా పెట్టాల్సింది.

"ఏ కుర్రాడికి?"

"అదే బస్‌స్టాండులో కూలి కుర్రాడు, వాడు చూపకపోతే నేను స్టాండు లోపలికెళుదును. ఈ బస్ కాస్తా వెళ్ళిపోయుండేది" అని ఓ అరగంట సేపు ఆటో డ్రయివర్‌ని ఆ కూలి కుర్రాన్ని, నన్ను నేను కూడా మెచ్చుకుని ఆ తర్వాత నోరు మూశాను.

చాలా స్పీడుగా పోతుందంటివే ఇంత మెల్లగా పోతుందేం బస్!

మూసుకున్న నా నోరును మరలా తెరవబోతుండగా కండక్టర్ చిల్లరతెచ్చి చేతిలో పెట్టాడు లెక్కపెట్టుకున్నాను. రెండు టిక్కట్లకూ ముప్పయి ఎనిమిది రూపాయల చిల్లర తీసుకుని మిగతా డబ్బు చేతిలో వుంచాడు.

"పదిహేనేగా టిక్కట్టు" అంది శోభ అనుమానంగా కండక్టర్ వైపు చూస్తూ.

"సూపర్ డీలక్స్‌కదూ! చూడు ఈ సీట్స్ ఎంత మెత్తగా ఎంత రాయల్‌గా వున్నాయో మనల్ని నాలుగు గంటల్లో చేరుస్తుంది మరి ఆ మాత్రం ఎక్కువచార్జీ తీసుకోరూ!"

గర్వంగా చెప్పాను. శోభకంటే ఎక్కువ విషయాలు తెలిసిన దాన్ని కదా మరి.

మరో అరగంట ఆ బస్‌ను కండక్టర్ ఔదార్యాన్ని మెచ్చుకున్నాక వేరే టాపిక్‌తో కెళ్ళిపోయాం.

ఆమె కష్టాలు ఆమెవి, నా కష్టాలునావి మొత్తానికి ఒకరి నాకు కష్టాలు ఒకరు వినకుండా ఒకరి కష్టాలుఒకరు ఏకరువు పెట్టుకుంటూనే వున్నాం.

బస్ ఆగింది. ఇద్దరు ముగ్గురు ఎక్కారు ఒకతను నా సీట్ ప్రక్కనున్న స్టీల్ స్టూల్‌మీద కూర్చున్నాడు.

"ఇదేమిటి? ఓవర్‌లోడ్ చేస్తున్నాడు ఈ బస్‌ను కూడా" అని విసుగు ఆశ్చర్యమూ రెండూ కలిపి ముఖానికి పూసుకుంది శోభ.

"పోనీలే పాపం అన్నాను. పాపం ఎవరికో నాకే అర్థంకాలేదు ఓ నిముషం సేపు తూ కొరకు ఎదురుచూచి మరీ మమ్మల్ని ఎక్కించు కున్న ఆ కండక్టర్ అంటే నాకు చెడ్డ సదభిప్రాయం మాత్రం ఏర్పడి పోయింది.

బెంగుళూరు నుండి వేలూరు వెళ్ళే రూట్ చాలా అందంగా వుంటుంది. రోడ్డుప్రక్కన చెట్లు దూరాన కొండలు చల్లటి వాతావరణం. కొద్దిసేపు ఇద్దరం వాటిని ఆస్వాదించడంలో మునిగిపోయాం.

అరే మనకి టిక్కెట్లు యివ్వలేదు. తృళ్ళిపడ్డట్టుగా అంది శోభ అప్పటిదాకా గుర్తులేదు టిక్కెట్టివ్వలేదని మెత్తటి కుషన్స్ మెచ్చుకోవ డంతో ఆ సంగతే మర్చిపోయాం,

"ఇటు సైడ్ వస్తే అడుగు" అంది శోభ. గ్లాసుడోర్ కాస్త ప్రక్కకు లాగుతూ.

పోనీలెద్దూ టిక్కెట్టు కోసుందడు. జేబిలో వేసుకున్నట్టున్నాడు పోనీ పాపం.

శోభ కూడా మాట్లాడలేదు. తీసుకోవాల్సినంత చార్జీ తీసు కున్నాడు అంతకంటే ఎక్కువ తీసుకోలేదుగా టిక్కెట్టుకోస్తే మాకేం. కోయకపోతే మాకేం నష్టం కలిగింది కనక అడగడానికి.

నేను రాజమండ్రిలో శోభ నెల్లూరులో. ఇద్దరం కలుసుకోను ఎప్పుడోకాని పడదు తనకు ఒంట్లో బాగలేదని తోడురమ్మని వచ్చి అడిగితే వచ్చాను. అందుకే ఓ నిముషమైనా వ్యర్థం చేయకుండా మాట్లాడుకున్నాము. నాకు మాట్లాడి మాట్లాడి తల తిరుగుతున్నట్టుగా అయింది. బస్‌లో మనుషులు పలచబడ్డారేమో ఎత్తెత్తి వేస్తోంది బస్. ఆ కుదుపులకు మరీ తల దిమ్మెక్కిపోతోంది.

కాసేపు పడుకుంటాను అని ఎయిర్‌పిల్లోలోకి గాలిఊది ప్రక్క సరిచేసుకుని ఇద్దరు మనుషులు కూర్చునే సీట్లో హాయిగా విశ్రమించి కళ్ళుమూసుకున్నానంతే.

'గుడియాత్తం గుడియాత్తం వేలూరు వేలూరు' అని అరుస్తున్నారు. నేను నన్ను కాదన్నట్టుగా మరలా కళ్ళుమూసుకున్నాను. మరలా గుడియాత్తం గుడియాత్తం వేలూరు వేలూరు అనే అరుపుకి టైమ్ చూసుకున్నాను. అప్పుడే పదయిపోయింది. ఇంకా ఓగంట ప్రయాణం వుంది వేలూరుకు ఇదేవిటి ఇంత స్లోగా పోతోంది బస్!

పదకొండు గంటలయితే చూడరు సి.యం.సి.లో. మరలా సాయంత్రమే. పిల్లలు గుర్తు వస్తున్నారు.

"మీరు వేలూరువెళ్ళాలి కదా!" అని కాబోలు సంజ్ఞలతో అడిగాడు క్లీనర్ కుర్రాడు. అవునన్నట్లు తలూపాను.

అయితేరండి అన్నట్లు పెట్టె పట్టుకుని బస్‌దిగేసాడు. నేను ఆదరాబాదరా వెంటబడ్డాను.

ఎంగ? అన్నాను వచ్చిరాని అరవంలో వాడు కన్నడ అరవం కలిపి వేలూరు బస్ ఎక్కిస్తాను రమ్మన్నాడు.

అదేమిటి? వేలూరుకు టికట్టు తీసుకున్నాంకదా! అన్నాను ఇంగ్లీషులో. వాడికి ఇంగ్లీషు రాదని తెలుసు కానీ ఏం చేయాలి నాకు అరవం రాదు కన్నడమూ రాదు.

కండక్టరుగారు కనబడ్డంలేదు. ఇక గత్యంతరంలేక వాడి వెంట పడ్డాం. వాడు ఓ డొక్కుబస్‌లోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు.

మాకు టిక్కట్ అరిచాను.

నేను తీసిస్తాను మీకేం భయంలేదు అన్నట్టు సంజ్ఞలు చేసాడు మాకర్ధంగాని భాషలో మాట్లాడుతూ. నేను వాడినీసారి వదలదల్చుకోలేదు. సూపర్ డీలక్స్ అంటూ ఎక్కువ డబ్బులు తీసుకుని టిక్కెట్టన్నా కొనకుండా ఈ డొక్కుబస్‌లో కూర్చోబెడ్తాడా?

గుడియాత్తం నుండి వేలూరు వెళ్ళే బస్ కండక్టర్‌తో ఇంగ్లీషులో చెప్పాను వున్న విషయం.

కనెక్షన్ తీసుకున్నారా టిక్కెట్టేది? అన్నాడు.

టిక్కెట్టివ్వలేదు అన్నాను.

టిక్కెట్టు లేకపోతే కొనుక్కోవాలి అని వేరేవాళ్ళ దగ్గరకెళ్ళి పోయాడు.

నేను కిటికీ దగ్గరకెళ్ళి ఆ పిల్లాడిని పట్టుకున్నాను.

తీసిస్తాలే అంత తొందరెందుకు? అన్నట్లు విసుక్కున్నాడు. ఆ తర్వాత ఐదు నిముషాలకు నా చేతిలో బులుగు టిక్కెట్లు పెట్టి వాళ్ళ భాషలో కండక్టర్‌తో ఏదో చెప్పి నా వైపు చూసి వెళ్ళిపోయాడు.

అప్పటికి నాకు ధైర్యం వచ్చింది. డీలక్స్ సుఖం అయిపోయింది అని నవ్వింది శోభ భలే మోసం అంది పైగా.

నిజమే నాకు ఎంతడబ్బయినా ఖర్చుపెట్టుకోవడం ఇష్టమేగానీ ఇలా మోసపోవడం చాలా బాధ.

బస్ కదిలింది దగడగ అంటూ సూపర్ డీలక్స్‌లో వచ్చిన మాకు ఈ బస్ చాలా విసుగ్గా అసహ్యంగా మా స్టేటస్ తగ్గిపోయినట్లుగా అవమానంగా వుంది.

కానీ తప్పేదేముంది ఆ విసుగులో మా యిద్దరిమధ్య మాటలు కూడా కరువయ్యాయి. అలా విసుగ్గా, నిశ్శబ్దంగా కూర్చున్న మా దగ్గరకొచ్చి టిక్కెట్టు అడిగాడు కండక్టర్.

బులుగు టిక్కెట్టుతీసి చేతిలో పెట్టాను. అతను శోభవైపు తిరిగి టిక్కెట్టు అడిగాడు. అతనికి కాస్త తెలుగు అర్థమవుతుంది.

ఇద్దరికి ఆ క్లీనర్ కుర్రాడే టిక్కెట్ తీసి నా చేతిలో పెట్టినట్టు చెప్పి మరలా బులుగుముక్క అతని చేతిలో పెట్టాను.

దాన్ని మరలా తిప్పి నా చేతికి ఇచ్చేస్తూ ఇది ఒక్కరి టిక్కెట్టే ఇంకొకరికి తీసుకోవాలి అన్నాడు ముభావంగా కండక్టర్.

ఆ క్లీనర్ కుర్రాడు మీతో మాట్లాడాడే అన్నాను. మీకొక్కరికే టిక్కెట్ కొన్నాడు.

ఒక్కరికేనా? షాక్ తిన్నాను నేను. అతను ముందుకెళ్ళాడు.

నాకు చాలా బాధగా వుంది. ఆ బాధ మరొక టిక్కట్టు కొనాల్సి వస్తుందని కాదు రెండున్నర రూపాయలు వెయ్యి రూపాయల ఖర్చులో చిన్నఫిగర్. కానీ ఎంత చక్కగా మోసగించాడు.

కండక్టర్‌కు తమవైపు చూపిస్తూ మాట్లాడి నా ప్రక్కన కూర్చున్నామె అడిగింది సగం అరవంలో, సగం తెలుగులో.

ఆ టిక్కెట్టు ఇలా ఇవ్వండి.

ఇచ్చాను.

నవ్వింది శోభ.

ఆమె ఈ టిక్కెట్ తీసుకుని బొడ్లో పెట్టుకు ఇవ్వలేదంటే ఎలా వుంటుందంటావ్. నేను నవ్వలేకపోయాను శోభ జోక్‌కు. ఎంత మోసం.

ముప్పయిఎనిమిది రూపాయలు ఊరికే తీసుకున్నారు. రెండు టిక్కెట్లు కొనివ్వలేదు వేలూరుకు. ఆలోచించేకొద్దీ నాకో సత్యం బోధపడింది. నేను బాధ్యతగల పేరు రాలిగా ప్రవర్తించి వుంటే ఈ మోసం జరిగుండేది కాదు.

టిక్కెట్లు కోయనప్పుడే నిలదీసి అడిగి అతని అవినీతి అరికట్టి వుంటే యీ మోసం జరగడానికి అవకాశం వుండేదికాదు. ఎవరికి వారే తమకు నష్టం జరగనంతవరకు ఏమిలే అనుకోబట్టే ఇలాటి మోసాలు సాగుతున్నాయి. మోసగించడానికి-బాగా ఆలోచిస్తే-కారణం నేను పౌర పాటునాది.

❋